క్లుప్తంగా

వేచలంలో దుర్గమ్మను దర్శించుకున్న బూడి



వేచలంలో బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న గురు భవానీ దంపతులు

దేవరాపల్లి : మండలంలోని వేచలం అఖిలేశ్వర స్వామి శివ పీఠంలోని దుర్గాదేవి అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు సోమవారం దర్శించుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. శివ పీఠం ధర్మకర్త, గురు భవానీ కోడూరు వెంకటరావు, వరహాలమ్మ దంపతులు బూడి ముత్యాలనాయుడును, జెడ్పీటీసీ కర్రి సత్యంను ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేచలం సర్పంచ్ శఠారినాయుడు, చిన్నంనాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు



ఇసుక రవాణా జరగకుండా పొక్లెయిన్‌తో కాలువ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : చోద్యం వద్ద బొడ్డేరు గెడ్డ వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆదేశాల మేరకు చోద్యం వద్ద ఉన్న భారీ వంతెన వద్ద ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లు రాకుండా పెద్ద కాలువ ఏర్పాటు చేశారు. వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరగడం వల్ల వంతెనకు ముప్పు ఉందని పలువురు పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలపడంతో ఈ వంతెన వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పెద్ద కాలువలు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

శాంతియుత ర్యాలీకి అనుమతి కోరుతూ వినతి

నర్సీపట్నం : ఇసుక సమస్యపై ఈ నెల 21న చేపట్టనున్న శాంతియుత ర్యాలీకి అనుమతి కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమ వారం సీఐ ఎల్.రేవతమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ న్యాయ విభాగం ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ నాయకులు యాదిగిరి శేషు మాట్లాడుతూ నిబంధనల మేరకు పోలీసుల అనుమతి కోరుతూ సీఐకి దరఖాస్తు చేశామన్నారు. ఇసుక విధానంలో లోపం వల్ల భవన నిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మికులు నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నారన్నారు. ఇసుక సరఫరా చేయకపోవడం వల్ల కార్మికు లు ఉపాధి కోల్పోయారన్నారు. గబ్బాడ స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వలను కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత ర్యాలీ చేపట్టామన్నారు.

అధ్వానంగా రహదారి



వంటర్లపాలెం- మంగళాపురం రహదారి దుస్థితి

మాడుగుల రూరల్ : రెండు మండలాలను కలుపుతూ ఉన్న రహదారి శిథిలావస్థకు చేరింది. వంటర్లపాలెం గ్రామం నుంచి మంగళాపురం పోవు రెండు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా మారింది. రోడ్లు, భవనాలు శాఖ పరిధిలో గల ఈ రహదారి 2008లో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హయాంలో రూ.78 లక్షలతో రహదారి నిర్మించారు. ఇపుడు రహదారి శిథిలావస్థకు చేరడంతో ఈ దారిలో ప్రయాణానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వంటర్లపాలెం గ్రామానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వచ్చినపుడు ఈ రహదారి సమస్య గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు మాజీ సర్పంచ్ కుమారరాజు తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సోమశేఖర్

మాకవరపాలెం : ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ సోమశేఖర్‌ను నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్‌కు అరకు బదిలీ అయింది. ఈ నేపథ్యంలో ఇక్కడ డీటీగా పనిచేస్తున్న సోమశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

చేప పిల్లల కేంద్రం ఫినిష్!

ఉమ్మడి జిల్లాలోనే తాండవలో గల ఏకైక చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం నేడు నిర్లక్ష్యపు నీడలో దర్శనమిస్తుంది. భవనాలు శిథిలం అవుతున్నాయి. సిబ్బంది లేక కార్యాలయం మూసి ఉంటున్నది. నిధులు మంజూరు చేయక చేప పిల్లల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.

- తాండవలో గతంలో ఏటా కోటి 25 లక్షలకు పైగా పిల్లలు ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లాలో మత్స్యకార సంఘాలకు సరఫరా
- ఈఏడాది నిధులు మంజూరు చేయక నిలిచిన చేప పిల్లల ఉత్పత్తి

నాతవరం : తాండవ రిజర్వాయరు దిగువ ప్రాంతంలో 1984లో మండలంలో చమ్మచింత పంచాయతీ పరిధిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పట్నుంచి ప్రతి ఏటా జూలై ఆగస్టు నెలలో చేప పిల్లలు కేంద్రంలో కృత్రిమ ఉత్పత్తి ద్వారా కోటి 25లక్షలు వివిధ రకాలు చేప పిల్లలను ఉత్పత్తి చేస్తుంటారు. పెద్ద చేపలకు హార్మోన్లు అభివృద్ధికి ఇంజక్షన్లు చేసి కృత్రిమ ఉత్పత్తి ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేసి వాటిని మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేస్తుంటారు. మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేయగా మిగిలిన పిల్లలను జిల్లా వ్యాప్తంగా ఉన్న తాండవ, రైవాడ, కల్యాణపులోవ, కోనాం, వరాహ, మేహాద్రిగెడ్డ , రావణాపల్లి రిజర్వాయర్లలో విడుదల చేసేవారు. చెరువుల్లో పెంచుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు కూడా విక్రయాలు జరిపేవారు. అంతంటి ప్రాముఖ్యం కలిగిన తాండవలో గల చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రంలో ఈ ఏడాది మచ్చుకైనా చేప పిల్లలు ఉత్పత్తి చేయలేదు.



శిథిలావస్థకు చేరిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం భవనాలు

నిత్యం మత్స్య సహకార సంఘాల సభ్యులు, అధికారులతో కళకళలాడే ఉత్పత్తి కేంద్రంలో సిబ్బంది జాడే కన్పించలేదు. ఇటీవల కాలంతో ఎప్పుడు చూసినా తాండవ చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం మూసి ఉంటుంది. చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు నిర్మించిన నీటి కుండీలు నీటితో నిండుగా కన్పిస్తున్నాయి. నీటి కోసం కేంద్రంలో ఏర్పాటు చేసిన బోరుని ఉపయోగించక మరమ్మతుకు గురై అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి మొక్కల మధ్య కన్పించకుండా ఉంది. అధికారులు లేకపోవడంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం శిథిలమై గేట్లు ఊడి పోయి భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. కీటికీలు, తలుపులు, చెదలు పట్టి అధ్వానంగా ఉండడంతో అందులో విషసర్పాలు సయ్యాటలు అడుతూ ఉండడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసే సిబ్బంది పదవీ విరమణ చేయగా, కొందరు ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ కేంద్రం నర్సీపట్నం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో నడుస్తుంది. వారు కూడా ఈ కేంద్రానికి వచ్చిన దాఖలాలు లేవు. దీంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం మనుగడ పూర్తిగా కనుమరుగైనట్టుగా ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం మత్స్యకార అభివృద్ధి అధికారి నాగమణిని వివరణ కోరగా చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. గతంలో ఉండే సిబ్బంది ప్రస్తుతం లేరన్నారు. ఇతర ప్రాంతాలు నుంచి తెచ్చిన 12 లక్షలు చేప పిల్లలను తాండవ రిజర్వాయరులో విడుదల చేశామన్నారు.



తాండవలో చేప పిల్లలు పెంచేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీలు

ప్రభుత్వ వైఫల్యం కన్పిస్తుంది..



తాండవలో గల చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం అంటే ఉమ్మడి జిల్లాలోనే ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉండేది. వివిధ ప్రాంతాల నుంచి చేప పిల్లల కోసం మత్స్య సహకార సంఘాల సభ్యులు, ప్రవేటు వ్యక్తులు వచ్చేవారు. జిల్లా స్థాయి అధికారులు చేప పిల్లల ఉత్పత్తిని చూసేందుకు వస్తుండేవారు. ఆనాటి తాండవలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం రావాలంటే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. సిబ్బందిని నియమించాలి. ఈ విషయాన్ని వచ్చే మండల సర్వసభ్య సమావేశంలో చర్చించి సభ్యుల అభీష్టం మేరకు చర్యలు చేపడతాం

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ నాతవరం

కలెక్టరుకు ఫిర్యాదు చేస్తా..



తాండవలో చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం నిర్లక్ష్యంపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తాను. కళ్ల ముందే భవనాలు శిథిలం అవుతున్నాయి. కేంద్రంలో చేప పిల్లలు ఉత్పత్తి నిలిచిపోయింది. వీటిన్నింటిపై కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాను. అవసరమైతే ఈ ప్రాంతీయులతో కలిసి రాజకీయాలకు అతీతంగా కేంద్రం పూర్వ వైభవం కోసం పోరాటం చేసేందుకు వెనుకాడేది లేదు.

– అడిగర్ల రాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

ఆర్డీవో వి.వి.రమణ



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మండలస్థాయి అధికారులను ఆర్డీవో వి.వి.రమణ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డివిజన్‌లోని పలు మండలాల నుంచి వివిధ సమస్యలపై 14 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో పేర్కొన్నారు. ప్రతి అర్జీకి అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిష్కరించేందుకు వీలుకాకపోతే కారణాన్ని లిఖితపూర్వకంగాఅర్జీదారుడుకి తెలియజేయాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

రోలుగుంట హౌసింగ్ ఏఈగా రామకృష్ణ



రోలుగుంట : స్థానిక హౌసింగ్ ఏఈగా సిహెచ్.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన డి.ప్రేమానందం నర్సీపట్నం ఆర్బన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నర్సీపట్నం డివిజన్ హౌసింగ్ ఈఈ కార్యాలయంలో పని చేస్తున్న రామకృష్ణ ఇక్కడకు బదిలీ అయి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఏఈ విలేకరులతో మాట్లాడుతూ గృహ లబ్ధిదారులకు శాఖాపరంగా సమకూర్చాల్సిన వనరులు సకాలంలో అందజేసి, సత్వర ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటానన్నారు.

తాగునీటి పథకం అధ్వానం... చేతిబోరు దైవాధీనం



చమ్మచింత గ్రామంలో మరమ్మతుకు గురైన చేతి బోరు

నాతవరం : మండలంలో చమ్మచింత గ్రామం మధ్యలో ఉన్న చేతిబోరుకు ప్రత్యేకత ఉంది. ఈబోరు ఉన్న ప్రదేశంలో పూర్వం తాగునీటి బావి ఉండేది. గ్రామస్తులంతా అ బావిలో నీరే తాగేవారు. ఈ బావిలో నీరు తాగితే ఎలాంటి రోగాలు వ్యాపించవని గ్రామస్తులకు అపారమైన నమ్మకం. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో గ్రామానికి ప్రభుత్వం చేతిబోరు మంజూరు చేస్తే అధికారులు బావి ఉన్న ప్రదేశంలోనే బోరు ఏర్పాటు చేశారు.

చమ్మచింతలో నీటి కష్టాలు

గ్రామస్తులు తాగునీటికి ఈ చేతిబోరునే వినియోగిస్తున్నారు. అయితే ఈ బోరు నెల రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. దీనిని బాగు చేయించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకూ వారు స్పందించలేదు. గ్రామంలో తాగునీటి పథకాలు ఉన్నా గ్రామస్తులు చేతి బోరు నీరే తాగుతారు. తాగునీటి పథకాల నుంచి వచ్చే నీరు తాగడం వల్ల గ్రామంలో చాలా మందికి జ్వరాలు వ్యాపించాయని చెబుతున్నారు. నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చేతిబోరు నీటిని, తాగునీటి పథకాల నీటికి పరీక్షలు జరపగా, చేతి బోరు నీరే బాగుందని అధికారులు నిర్ధారించారు. దీంతో గ్రామస్తులు చేతి బోరు నీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే బోరుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

డి.యర్రవరంలో ఉచిత వైద్య పరీక్షలు

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. డి.యర్రవరం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 89 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందికి రక్త పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా వైద్యాధికారి రోగులకు సూచించారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

గొండుపాలెంలో...

కె.కోటపాడు : ప్రతి నెలా గ్రామంలో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం ఎఫ్‌పీసీ వైద్య సేవలు అందించారు. 227 మందికి వైద్యం నిర్వహించడంతో పాటు ఆరుగురు గర్భిణులకు తనిఖీలను జరిపా రు. ఉచితంగా మందులను ఇచ్చారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు జరుపుకోవడం క్షేమదాయకమని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, పీహెచ్ఎన్ కనకవేణి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్ఎం కుమారి పాల్గొన్నారు.



డి.యర్రవరంలో రోగులను పరీక్షిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నిధుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా



సత్యవరంలో పింఛనుదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు



నారాయణరాజుపేటలో ప్రజలతో సమావేశమైన కేంద్ర కమిటీ సభ్యులు

మాడుగుల : మండలంలోని సత్యవరం గ్రామంలో నేషనల్ లెవెల్ మోనిటరింగ్ కమిటీ (ఎన్ఎల్ఎం) సోమవారం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సర్వే చేసింది. పింఛను లబ్ధిదారులతో మాట్లాడి సామాజిక పింఛన్లు ఎలా అందుతున్నదీ తెలుసుకున్నారు. ఉపాధి పథకంలో నిర్మాణం జరిగి న భవనాలు, రోడ్లు పనుల సమాచారం సేకరించారు. డ్వాక్రా సభ్యులకు అందుతున్న రుణాలు, వాటి వినియోగంపై లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు. సత్యవరంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా కొనసాగుతున్నాయని కేంద్ర కమిటీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్, శ్రీనివాస్, సర్పంచ్ నాగమణి రామారావు, ఎంపీటీసీ తలారి అప్పారావు, ఉప సర్పంచ్ పెంటయ్య, ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, ఏపీవో ఈశ్వరరావు, వెలుగు సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నారాయణరాజుపేటలో..

మాకవరపాలెం : కేంద్ర నిధుల వినియోగంపై నేషనల్ లెవల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) కమిటీ ఆరా తీసింది. మండలంలోని నారాయణరాజుపేటలో సోమవారం సాయంత్రం ఈ కమిటీ పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో కమిటీ సభ్యులు అనిల్ నింబోర్కర్, అనిల్ గైక్వాడ్ సమావేశం అయ్యారు. ఉపాధి హామీ పనులు, కేంద్ర పథకాల అమలు, లబ్ధిపై అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు అందుతున్న రుణాల వినియోగంపైనా మాట్లాడారు. ఉపాధి పనులను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ పీలా వరలక్ష్మి, మాజీ సర్పంచ్ గిరి, కార్యదర్శి జ్యోతిరాణి, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు ఎంపీపీ అభినందనలు

చీడికాడ : స్థానిక నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన హేమ సుందరావును ఎంపీపీ, పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందన తెలిపారు. ఎంపీడీవో హేమ సుందరరావును ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, మండల యూత్ విభాగం అధ్యక్షుడుస్వామినాయుడు, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు, సన్యాసిరావు, సర్పంచ్‌లు అప్పలనాయుడు, రమణ తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం నూతన తహసీల్దారు ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణలను కలిసి అభినందనలు తెలిపారు.

మహాచండీ అవతారంలో అమ్మవారు



సీతయ్యపేట ఆలయంలో హోమాలు



రోలుగుంటలో అన్న సమారాధన



కె.జె.పురంలో అష్టలక్ష్మి కుంకుమ పూజలు



నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో



వంటర్లపాలెం కనక దుర్గమ్మ అమ్మవారు



మాడుగులలో లలితా త్రిపుర సుందరి అవతారంలో



సీతయ్యపేటలో మహాచండీదేవిగా..



కె.జె.పురం కళావేదిక వద్ద దేవీ పూజలు

మాడుగుల రూరల్ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున గల కనకదుర్గమ్మను 5వ రోజు సోమవారం మహాచండీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, గురు భవానీ దండి నర్సింగరావు సారథ్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.జె. పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కలశం వద్ద అమ్మవారికి అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకొండల రావు, కమిటీ సభ్యుడు రాపేట బాబూరావు పాల్గొన్నారు. స్థానిక కళావేదిక మీద ప్రతిష్ఠించిన అమ్మవారికి పలువురు భక్తులు పూజలు నిర్వహించారు.

మాడుగుల : మాడుగులలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు దేవీతల్లి లలిత త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక న్యాయవాది ప్రసాదరావు ఆర్థిక సహాయంతో అన్నమాచార్య వాగ్దేవరదాయని, భక్తి సంకీర్తనలతో పాటు మహిళల కోలాటాలు ప్రదర్శించారు.

రోలుగుంటలో అన్న సమారాధన

రోలుగుంట: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రోలుగుంటలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ప్రసాదం స్వీకరించారు.

బుచ్చెయ్యపేట : దేవీశరన్నవరాత్రి దసరా మహోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల ఆలయంలో అమ్మవారికి మహా కుంభాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి సన్నిధిలో హోమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నర్సీపట్నం: సోమవారం పట్టణంలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్ : గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు కె. రమాదేవి పేర్కొన్నారు. సోమ వారం ఆమె స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. గతంలో తాను పలు మండలాల్లో తహసీల్దారుగా పనిచేసిన అనుభవం ప్రకారం అన్ని గ్రామాలను పర్యటించి, అయా గ్రామాల్లో వున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని, ప్రజలు, రైతుల నుంచి నేరుగా వారి సమస్యలు అడిగి తెలుసుకుంటానని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో పెండింగ్ పను లు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే 2025 జనవరి 1 వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 28 వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని, అలాగే ఓటర్ల అభ్యంతరాలు, దిద్దుబాట్లు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో నవంబర్ 9, 10, 23, 24, తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని, బీఎల్ఓల ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు చేస్తారని తెలిపారు.

ఎం.కోడూరులో జయభారత్ సంఘం వితరణ

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు జయభారత్ సంఘం వారి ఆధ్వర్యంలో టెంట్, 50 కుర్చీలు, డోలక్కు, తాళాలను సోమవారం గ్రామానికి విరాళంగా అందించారు. గ్రామంలో ఎవరైన మృతి చెందినపుడు వారికి నీడ, ఉపయోగం నిమిత్తం వీటిని అందజేశారు. సుమారు రూ.30 వేల విలువ చేసే వస్తువులు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. వీటిని గ్రామస్తులు ఉచితంగా వినియోగించుకోవాలన్నారు.

10న అన్నసమారాధన

జయభారత్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, ఈ నెల 10వ తేదీ రాత్రి గ్రామంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా దుర్గమ్మకు అంబలం పూజ

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో సుందరపు మోదినాయుడు భవానీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దుర్గాభవానీ అంబలం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బాగంగా దుర్గాదేవి మండపాన్ని ప్రత్యేకంగా అరటిజోర్లుతో అలంకరించారు. దుర్గాదేవికి పూజాది కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో భవానీదీక్షధారులు హాజరయ్యారు. గురు భవానీలు కొత్తూరు బాపనయ్య, చల్లపల్లి పద్మ, శ్రీనివాసశర్మతో పాటు విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.



దుర్గమ్మ మండపం వద్ద అంబలం పూజలో భక్తులు

పంచాయతీ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



తెనుగుపూడి కార్యదర్శి సంతోషి నళినిని సత్కరిస్తున్న ఉప సర్పంచ్ పెదనాయుడు తదితరులు



తామరబ్బ కార్యదర్శి లింగన్న, వీఆర్వో కాసప్పలను సత్కరిస్తున్న సర్పంచ్ రామకృష్ణ తదితరులు

దేవరాపల్లి : తెనుగుపూడి పంచాయతీ కార్యదర్శిగా, ఇంచార్జ్ ఈవోపీఆర్డీగా జి.సంతోషి నళిని విశేష సేవలందించారని స్థానిక ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు కొనియాడారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా బదిలీ అయిన సంతోషి నళిని పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సోమవారం ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారని అభినందించారు. తామరబ్బ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎల్.లింగన్న, వీఆర్వోగా పనిచేసిన కాసప్పలను బదిలీ కావడంతో వీరిని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, ఎంపీటీసీ బండి గౌరమ్మ ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుమ్మడపు మహేష్, కడారి రాజు, శివాజీ, చంటి, రవి, సింహాచలం పాల్గొన్నారు.

డీటీ అప్పారావును సత్కరించిన ఎంపీపీ, జెడ్పీటీసీ

దేవరాపల్లి : దేవరాపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.అప్పారావును ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు సోమ వారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. డీటీని కలిసిన వారిలో వైస్ ఎంపీపీ గంగాభవానీ, సర్పంచ్‌లు గూడెపు రాము, చింతల సత్య వెంకటరమణ, గంధం రామకృష్ణ, ఎంపీటీసీలు కోలా గోపి, మజ్జి దేవిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ రమణ, మధు, గోవింద, పార్థసారధి, బూడి సూర్యనారాయణ, బండారు గోవింద ఉన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబూరావు